జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 19-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 705 పేజీలు: 4 వెల: రూ.7

# అగ్రిమెంట్ పేరుతో భూమి కాజేసి..


# చెక్కులతో

# చీటింగ్..!





✳ మహిళను బెదిరించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి
✳ ఐటీఐ నగర్ స్థల వివాదంలో సంచలన ఆరోపణలు
✳ తప్పుడు పత్రాలతో మూడో వ్యక్తికి విక్రయించేశాడని పోలీసులకు ఫిర్యాదు
✳ రూ.70 వేల చెక్కులు బౌన్స్
✳ అకౌంట్ క్లోజ్ చేసి మోసం చేశాడని ఆరోపణ
✳ 'పైసా ఇవ్వను.. నీ అంతు చూస్తా' అంటూ బెదిరించాడని మహిళ ఆవేదన
✳ న్యాయం చేయాలని కాశీబుగ్గ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు



INDIA NON JUDICIAL
Government of Andhra Pradesh
e-Stamp

| | |
|---|---|
| Certificate No. | IN-AP87445399062914W |
| Certificate Issued Date | 18-May-2024 05:03 PM |
| Account Reference | NEWIMPACC (IV)/ ap18105104/ AP-SKL/ AP-KBG/apvooeswu |
| DDO Code | 27002308001 O/o IG R |
| Unique Doc. Reference | SUBIN-APAP18105104635915998463 41W |
| Purchased by | DUMPALA VAMSI KRISHNA SON OF SUGREEVU |
| Description of Document | Article 0 Not Mentioned |
| Property Description | Not Applicable |
| Consideration Price (Rs.) | 0 (Zero) |
| First Party | DUMPALA VAMSI KRISHNA SON OF SUGREEVU |
| Second Party | Not Applicable |
| Paid By (For Whom) | DUMPALA VAMSI KRISHNA SON OF SUGREEVU |
| Stamp Duty Amount(Rs.) | 50 (Fifty only) |


VOONA ESWARA RAO AP18105104 KASIBUGGA STAMP VENDOR

Please write or type below this line

(I) రూ॥ 4,00,000/-ల్కు క్రయం ఖాయం అగ్రిమెంటు
గడువు 6 నెలలు
అడ్వాన్సు రూ॥ 1,00,000/-లు
2024వ సంవత్సరం మే నెల 18వ తేదిన
వ్రాయించుకున్నవారు : శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, చినబాడాం పోస్టు, చినబాడాం గ్రామం, కాపురం, దుంపల సుగ్రీవు గారి కుమారుడు వంశీక్రిష్ణ గారికి.
వ్రాయించి యిచ్చినవారు : శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, కాశీబుగ్గ పోస్టు, కాశీబుగ్గ గ్రామం, గవర్నమెంటు ఐ.టి.ఐ దగ్గరలో, డోర్ నెం. 16-227 రు. కాపురం, గృహకృత్యం, కుందు సూర్యనారాయణ గారి భార్య రాజేశ్వరి వ్రాయించి యిచ్చిన క్రయం ఖాయం అగ్రిమెంటు.
(II) నాకు పైకం అవసరం కలిగి నా స్వార్జితమైనట్టి అనగా నాకు శ్రీ కాశీబుగ్గ సు॥రి॥ వారి ఆఫీసు తాలూకా 1వ పుస్తకం

పలాస/శ్రీకాకుళం, జూన్ 18 (వార్త): శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఐటీఐ నగర్‌లో చోటుచేసుకున్న స్థల వివాదం సంచలనంగా మారింది. అగ్రిమెంట్ పేరుతో తన ఇంటి స్థలాన్ని తీసుకుని, అనంతరం తప్పుడు పత్రాలతో మూడో వ్యక్తికి విక్రయించి, నష్టపరిహారం పేరుతో ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అయ్యేలా చేసి మోసం చేశాడంటూ ఓ మహిళ కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు కుందు రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఐటీఐ నగర్‌లో తన స్వాధీనంలో ఉన్న ఏడు మూరల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసేందుకు చినబాడాం గ్రామానికి చెందిన దుంపల వంశీకృష్ణ 2024 మే 18న అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఆరు నెలల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి మిగిలిన సొమ్ము చెల్లిస్తానని హామీ ఇచ్చాడని, అయితే గడువు ముగిసినా రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేశాడని ఆరోపించింది. ఇంతలో తన అనుమతి లేకుండానే తప్పుడు పత్రాలను సృష్టించి, అదే స్థలాన్ని ఐటీఐ నగర్‌కు చెందిన మరో మహిళకు విక్రయించాడని ఫిర్యాదులో పేర్కొంది. విషయం వెలుగులోకి రావడంతో పెద్దల సమక్షంలో 2025 జనవరి 29న అగ్రిమెంట్ రద్దు చేసి, నష్టపరిహారంగా రూ.2.20 లక్షలు చెల్లిస్తానని వంశీకృష్ణ లిఖితపూర్వకంగా అంగీకరించాడని తెలిపింది. అందులో భాగంగా రూ.1.50 లక్షలు నగదు చెల్లించి, మిగిలిన రూ.70 వేలకు రెండు చెక్కులు ఇచ్చాడని పేర్కొంది. అయితే చెక్కులు బ్యాంకులో జమ చేయగా "అకౌంట్ క్లోజ్డ్" కారణంతో తిరస్కరణకు గురయ్యాయని, బ్యాంకు రిటర్న్ మెమోలు కూడా తన వద్ద ఉన్నాయని తెలిపింది. ఈ విషయమై ప్రశ్నించగా మొదట అనారోగ్యం, ఆపరేషన్ వంటి కారణాలు చెబుతూ తప్పించుకున్నాడని, అనంతరం పూర్తిగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయాడని ఆరోపించింది.

అంతేకాకుండా, 'నీ దిక్కున్న చోట చెప్పుకో.. ఒక్క పైసా కూడా ఇవ్వను.. ఆడదానివని చూడకుండా నీ అంతు చూస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. భర్త వృద్ధాప్యంతో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, తన కుటుంబ పరిస్థితిని ఆసరాగా చేసుకుని మానసికంగా వేధింపులకు గురిచేశాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తప్పుడు డాక్యుమెంట్ల వినియోగం, చెక్ బౌన్స్, ఆర్థిక మోసం, బెదిరింపుల అంశాలపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఆమె కాశీబుగ్గ పోలీసులను కోరింది. ఈ ఫిర్యాదుపై పోలీసులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



Government of Andhra Pradesh
e-Stamp

| | |
|---|---|
| Certificate No. | IN-AP61485426138225X |
| Certificate Issued Date | 29-Jan-2025 08:24 PM |
| Account Reference | NEWIMPACC (SV)/ ap18099604/ AP-SKL/ AP-SKL/apsidraju |
| DDO Code | 27002308001 O/o IG R |
| Unique Doc. Reference | SUBIN-APAP18099604096048519436 88X |
| Purchased by | KUNDU RAJESWARI W o SURYANARAYANA PALASA |
| Description of Document | Article 7 Agreement |
| Property Description | Not Applicable |
| Consideration Price (Rs.) | 0 (Zero) |
| First Party | KUNDU RAJESWARI W o SURYANARAYANA PALASA |
| Second Party | Not Applicable |
| Paid By (For Whom) | KUNDU RAJESWARI W o SURYANARAYANA PALASA |
| Stamp Duty Amount(Rs.) | 100 (One Hundred only) |

SUDHAKARA RAO AP18099604 PALASA STAMP VENDOR

Please write or type below this line

అంగీకార ఒప్పందపత్రం
2025వ సంవత్సరం జనవరి నెల 29వ తేదిన
వ్రాయించుకున్నవారు : శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, కాశీబుగ్గ పోస్టు, కాశీబుగ్గ గ్రామం గవర్నమెంటు ఐ.టి.ఐ దగ్గరలో డోర్ నెం. 16-227 రు కాపురం గృహకృత్యం కుందు సూర్యనారాయణ గారి భార్య రాజేశ్వరి ( ) ఆధార్ నెం. గారికి.
వ్రాయించియిచ్చినవారు : శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, చినబాడాం పోస్టు, చినబాడాం గ్రామం కాపురం దుంపల సుగ్రీవు గారి కుమారుడు వంశీక్రిష్ణ (23) ఆధార్ నెం. 5839 3261 7128 రు వ్రాయించి ఇచ్చిన అంగీకార ఒప్పంద పత్రం.
(II) నేను తే 18-05-2024 ది నాడు మీ స్వార్జితమైనట్టి అనగా నాకు శ్రీ కాశీబుగ్గ సు॥రి॥వారి ఆఫీసు తాలూకా 1వపుస్తకం ద.నెం. 708... 2023 రుగా గల ఆస్తిని రూ॥ 4,00,000/-ల్కు మీ నుండి క్రయఅగ్రిమెంటు పొంది రూ॥ 1,00,000/-లు (అక్షరాల ఒక లక్ష రూపాయలు) మాత్రమే అడ్వాన్స్‌గాను, గడువు ఆరు నెలలుగా ఒక క్రయఅగ్రిమెంటు వ్రాయించి ఇవ్వడమైనది. అయితే సదరు గడువుకాలం ముగిసినను నేను రిజిస్ట్రీకి రాకపోగా, మీరు పలుమార్లు నన్ను సంప్రదించినను నేను సకాలంలో స్పందించలేకపోతిని. అయితే మన శ్రేయస్సు కోరిన దిగువ సాక్షులు సంతకములు చేసిన పెద్దల సూచన మేరకు మనము ఉభయులము గొడవలు పడుటయుక్తము కాదని బాగుగా ఆలోచించి నా పరిస్థితి బాగులేనందున పెద్దల సూచన మేరకు మీకు ముజరాగా రూ॥ 2,20,000/-లు (అక్షరాల రెండు లక్షల ఇరవై వేలు రూపాయలు) చెల్లించుటకు నేను పూర్తిగా అంగీకరించి ముజరా పైకంలో భాగంగా ఈ దినం దిగువ సాక్షుల యెదుట రూ॥ 1,50,000/-లు నగదుగాను, నా తాలూకా ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ పలాస బ్రాంచ్ గల నెం. 016997రు గల రూ॥ 50,000/-లు విలువ చెక్కును, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ పలాస బ్రాంచ్ గల నెం. 016998 గల రూ॥ 20,000/-లు విలువ రూపేణా మీకు ముట్టజెప్పడమైనది. ఈ దినం లగాయితు మీకు, నాకు శ్రీ కాశీబుగ్గ సు॥రి॥వారి ఆఫీసు తాలూకా ...

గొల్లవూరులో
## విషాదం
✳ మహిళ అనుమానాస్పద మృతి ✳ అనాథలైన ఇద్దరు చిన్నారులు
4లో

నేడు 'రెండేళ్ల నమ్మకం'పై..
## సిక్కోలు ప్రగతి సంబరాలు
✳ ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో భారీ బహిరంగ సభ ✳ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ✳ అభివృద్ధి, సంక్షేమ గణాంకాలను వివరించిన కలెక్టర్
4లో

## ఖాళీ బిందెలతో మహిళల నిరసన
✳ తాగునీరు ఇప్పించాలని కోరుతూ అలికాం-బత్తిలి రహదారిపై బైఠాయింపు ✳ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ✳ చుట్టూ నీరు ఉన్నా....చుక్క నీరు ఇవ్వలేరా అంటూ నినాదాలు ✳ రెండు గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ✳ ధర్నాకు మద్దతిచ్చిన వైసీపీ నాయకులు ✳ పట్టించుకోని పంచాయతీ అధికారులు ✳ సర్ది చెప్పిన పోలీస్ అధికారులు ✳ ససేమిరా అన్న మహిళలు, వైసీపీ నాయకులు ✳ వైసీపీ నేతలను పీఎస్‌కు తరలింపు ✳ అధికారులతో మాట్లాడుతామన్న సీఐ
4లో

## అంటువ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

**పలాస, జూన్ 18 (వార్త):** వర్షాకాలం సమీపిస్తుండడంతో అంటువ్యాధులతో తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర శ్రీశైన సాధికారక కమిటీ సభ్యుడు బూర్ల కృష్ణంరాజు అన్నారు. కిష్టిపురం గ్రామంలో గురువారం పలాస శాసనసభ్యులు గౌతు శిరీష ఆదేశాల మేరకు మండల కార్యదర్శి సంతోష్ కుమార్ నాయుడు పర్యవేక్షణలో గ్రామాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. ఈ సీజన్‌లో కలుషిత నీరు, ఆహారం, దోమల ద్వారా కలరా, టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా, హెపటైటిస్ ఏ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు శుభ్రమైన నీరు తాగడం, పరిశుభ్రత పాటించడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, వీధి ఆహారం తగ్గించడం ద్వారా ఈ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బర్ల తులసి, బాబురావు, ఢిల్లీ, ప్రసాద్, మామిడి దుర్గారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వారు.. ఆదర్శప్రాయులు

* ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించిన వైద్యుడు, లెక్చరర్, ఉపాధ్యాయుడు
* ప్రభుత్వ విద్యపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్న హెచ్ఎంలు
* అభినందనలు తెలియజేసిన విద్యాశాఖాధికారులు





**నరసన్నపేట, జూన్ 18(వార్త):** ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని, నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం ఇందుకు ప్రధాన కారణమని నరసన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ఏఎస్ నాయుడు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయన మాట్లాడుతూ, దంత వైద్యుడు డాక్టర్ సాగర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ పూజా భరద్వాజ్ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం శుభపరిణామమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న విద్యావంతులు, ఉద్యోగులు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ఇతర తల్లిదండ్రులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని, ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయని వివరించారు. నేటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలలకు అత్యంత ప్రాధాన్యత లభిస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోటీ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను కూడా అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తున్నారని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని హెచ్ఎం ఆర్ఏఎస్ నాయుడు పేర్కొన్నారు.

**పోలాకి:** ప్రభుత్వ పాఠశాలలపై తమకున్న విశ్వాసాన్ని ఆచరణలో చూపిస్తూ పోలాకి మండలంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఆరంగి సురేశ్‌కుమార్, క్రాంతి దంపతులు తమ ఇద్దరు కుమారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించేలా వారి నిర్ణయం ఉండటంతో పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. దంపతుల చిన్న కుమారుడు వైష్ణవ్‌ను ఎం.పి.పి.ఎస్. మబగాం పాఠశాలలో నాలుగో తరగతిలో, పెద్ద కుమారుడు వైభవ్‌ను జెడ్‌పీహెచ్ఎస్ మబగాం పాఠశాలలో ఆరవ తరగతిలో చేర్పించారు. ప్రైవేట్ విద్యాసంస్థల వైపు మొగ్గు చూపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయులైన తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకోవడం విశేషంగా నిలిచింది. గార మండలం కుమ్మరిపేట గ్రామానికి చెందిన ఈ ఉపాధ్యాయ దంపతులు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం అందుబాటులో ఉన్నాయని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని అభిప్రాయపడ్డారు. వారి నిర్ణయాన్ని సహచర ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, గ్రామస్థులు అభినందిస్తూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై సమాజంలో మరింత నమ్మకం పెరగడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ విద్య వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తూ తమ పిల్లలను అదే పాఠశాలల్లో చేర్పించిన ఉపాధ్యాయ దంపతులు పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



**మెళియాపుట్టి:** మెళియాపుట్టి మండలం డబారు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జీఈఎస్)లో గురువారం గగ్నేష్ అనే విద్యార్థిని మూడో తరగతిలో చేర్పించారు. విద్యార్థి తండ్రి నరేంద్ర మెళియాపుట్టి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, బోధన నాణ్యత, క్రమశిక్షణపై పూర్తి నమ్మకం ఉండటంతోనే తన కుమారుడిని ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ బడికి మార్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, డిజిటల్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను కల్పిస్తోందని, వీటిని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు నరేంద్ర పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్య అందుతున్నదన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు గగ్నేష్‌కు ఆత్మీయ స్వాగతం పలికి పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడే తన కుమారుడిని ప్రభుత్వ బడిలో చేర్పించడం ఇతర తల్లిదండ్రులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు నరేంద్రను ఎంఈఓ ఎం పద్మనాభరావు, పెద్దపద్మాపురం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ అభినందించారు.




## వైసీపీ ఫేస్ బుక్ ఖాతా పునరుద్ధరించాలి

**ఇచ్ఛాపురం, జూన్ 18 (వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ ఖాతాను బ్లాక్ చేయడం, అలాగే పార్టీకి మద్దతుగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరుల ఖాతాలను లక్ష్యంగా చేసుకుని అడ్డుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైస్సార్సీపీ ఐటి వింగ్ రాష్ట్ర కార్యదర్శి చినపాన సందీప్ రెడ్డి అన్నారు. ప్రజల మద్దతు పూర్తిగా కోల్పోయి, రోజురోజుకూ ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్న తెలుగుదేశం పార్టీ భయాందోళనలకు గురై ఇలాంటి వెనుకదారి రాజకీయాలకు పాల్పడుతోందని. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేక, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేక సోషల్ మీడియా వేదికలపై ప్రత్యర్థి గొంతును నొక్కివేయాలని చూస్తోందని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారిక ఖాతాలను బ్లాక్ చేయగలరు, పోస్టులను తొలగించగలరు, కార్యకర్తల ఖాతాలను టార్గెట్ చేయగలరు, కానీ కోట్లాది మంది ప్రజల గుండెల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై ఉన్న ప్రేమను, అభిమానాన్ని, విశ్వాసాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోలేరని, సోషల్ మీడియా ఖాతాలపై దాడులు చేయడం ద్వారా తమ అసహనాన్ని, అభద్రతాభావాన్ని టీడీపీ మరోసారి బయటపెట్టుకుందని. ప్రజల్లో తమపై విశ్వాసం లేదని, రాబోయే రోజుల్లో ప్రజల తీర్పు తమకు వ్యతిరేకంగా ఉండబోతుందని గ్రహించినందుకే ఇలాంటి దుశ్చర్య లకు పాల్పడు తోందని. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కక్షసాధింపు చర్యలకు దిగినా, ప్రజాస్వామ్య స్వరాన్ని అణచివేయడం ఎవరి వల్లా కాదని,ఖాతాలను ఆపవచ్చు కానీ ప్రజల ప్రేమను ఆపలేరని పోస్టులను తొలగించవచ్చు కానీ జగన్ పట్ల ప్రజల ఆదరణను తొలగించలేరని. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కుట్రలు పన్నినా, రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ప్రజలే ఇప్పటికే నిర్ణయించారని అన్నారు. ప్రజలతీర్పు ముందు ఇలాంటి కుట్రలు, కుయుక్తులు నిలవవని అన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

**పలాస ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షులు భీమారావు**



**పలాస, జూన్ 18 (వార్త):** జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని పలాస ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షులు ఎస్ భీమారావు అన్నారు. పలాస ఎలక్ట్రానిక్ మీడియా అధ్యకులు ఎస్ భీమారావు అధ్యక్ష తన కాశీబుగ్గ సాయి కాలనీలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి సీనియర్ జర్నలిస్టుల పలు సూచనలు సలహాలు తీసుకొని ముందుకు వెళ్తామని చెప్పారు. అనంతరం పలువురు పలాస నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టులు యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బి తులసీ రావు(చిట్టి), కార్యదర్శి కె శంకర్ తో పాటు ఎస్ రూప్ సుందర్, ఎల్ మోహనరావు, పి అంజి, పి హరికృష్ణ, జి తారకేశ్వరరావు (రమేష్), ఐ భాస్కరరావు, వీరస్వామి, కె కృష్ణారావు, బి లోకేష్, పి రాంబాబు, జి శ్రీను, కె కృష్ణ, మనీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల విక్రయాల్లో తేడాలు వస్తే చర్యలు



**సోంపేట జూన్ 18 (వార్త):** మారిన ఎరువుల విధానం నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు అనుగుణంగా ఎరువుల విక్రయదారులు ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా రైతులకు సక్రమంగా ఎరువులు విక్రయించాలని మండల తహసీల్దారు బి.అప్పలస్వామి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నరసింహమూర్తితో కలిసి గురువారం డీసీఎంఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. ఎరువుల విక్రయానికి కొత్తగా ప్రవేశపెట్టిన ఏపీ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా వ్యవసాయ శాఖ సూచన మేరకు తగు పరిమాణంలో ఎరువులు విక్రయించాలని కోరారు. ప్రతిరోజు జరిగే విక్రయాలకు సంబంధించి రికార్డులకు, భౌతిక నిల్వలకు సరిపోలిక ఉండాలని సూచించారు. ఇందుకు సంబంధించి అవసరమైన సాంకేతిక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డీసీఎంఎస్ ప్రతినిధి రాజేశ్వరరావు తగు వివరాలను అందజేశారు.

## ఘనంగా రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, జూన్ 18 (వార్త):** భారత చైతన్య యువజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ కన్వీనర్ బడ్డి మురళి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోడె రామచంద్ర యాదవ్ చిత్రపటానికి పాలభిషేకం చేసి అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు అనంతరం ఆయనకు దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం, మరింత ప్రజాసేవ చేసే శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకల సందర్భంగా మానవతా దృక్పథంతో ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు, ఆసుపత్రి సిబ్బందికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆశీ హరికృష్ణ రెడ్డి, బొట్టా హరికృష్ణ, సగ్గు చక్రవర్తి రెడ్డి, అదుగు బెహరా, కాతిలా రాజు, మద్దిల సంతోష్, కోటేష్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానూలు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమాలను ఎత్తివేయవద్దు

* గిరిజనులకు అన్యాయం చేయవద్దు * గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్



**మందస, జూన్ 18(వార్త):** శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని గిరిజన ఆశ్రమాలను ఎత్తివేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని గిరిజన శక్తి సంక్షేమ సంఘం, ఐక్య వేదిక, రైతు కూలీ సంఘాలు, మానవ హక్కుల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మందస మండలంలోని కిల్లోయి ఆశ్రమపాఠశాల వద్ద గురువారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ కిల్లోయి కోలనీ గిరిజన బాలిక ఉన్నత పాఠశాల లొత్తూరు, చీపి వివిధ పాఠశాలలు జిల్లాలో ఎత్తివేసే దిశగా ఉన్నతాధికారులు ద్రోహం చేసే దిశగా కనిపిస్తున్నాయన్నారు. సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు తగ్గింపు రాష్ట్ర ప్రభుత్వ రేషనలైజేషన్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. పాత పద్ధతి ప్రకారమే క్లాసులు కొనసాగించాలని, విద్య అందరికీ హక్కు, స్కూలు కుదింపు కాదన్నారు. గ్రామీణ ప్రాంత పిల్లల భవిష్యత్తును కాపాడాలని, ఉపాధ్యాయ పోస్టుల కోతలను నిలిపివేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలల అక్షరాస్యతను బలోపేతం చేయాలని, పిల్లల విద్య మా హక్కు స్కూలు కుదింపు కాదని, మాకు, మా తల్లిదండ్రులకు గ్రామ సంఘాలు, మండల సంఘాలు, జిల్లాల సంఘాలుగా అంగీకారం లేదన్నారు. పాత పద్ధతిని కొనసాగించాలని, కుదించడానికి వ్యతిరేకిద్దామని, ఆశ్రమ పాఠశాలలోని క్లాసులు కొనసాగాలన్నారు. రేషనైజేషన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పాఠశాలల్లో అన్ని తరగతులు, వసతులు కొనసాగించాలని, గిరిజన విద్యార్థుల విద్యాహక్కులను కాపాడాలని గిరిజన శక్తి సంక్షేమ సంఘం, ఐక్యవేదిక, రైతు కూలీ సంఘాలు, మానవ హక్కుల వేదిక సంయుక్తంగా డిమాండ్ చేశాయి. రద్దు చేయకపోతే ప్రభుత్వంపై ప్రత్యక్షంగా పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

## అదనపు నిధులతో వనిత మండలం వంతెన పనులకు ఊపు

* రూ.12 కోట్లు మంజూరు చేయడంతో తిరిగి ప్రారంభమైన నిర్మాణం * పనులను పరిశీలించిన ఆర్అండ్‌బీ ఏఈ హరినాథ్



పోలాకి, జూన్ 18 (వార్త):పోలాకి మండలం వనిత మండలం వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన పనులు అదనపు నిధుల మంజూరుతో మళ్లీ వేగం పుంజుకున్నాయి. కొంతకాలంగా నిలిచిపోయిన ఈ నిర్మాణ పనులు తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో తిరిగి ప్రారంభమయ్యాయి. వంతెన నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇటీవల ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వంతెన నిర్మాణ ప్రాధాన్యతను వివరించి అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరగా, ప్రభుత్వం స్పందించి అదనంగా రూ.12 కోట్ల నిధులను మంజూరు చేసింది. నిధుల విడుదల అనంతరం నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. వంతెన నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయ, వ్యాపార రంగాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది. గురువారం ఉదయం రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం విడుదల చేసిన అదనపు నిధులతో వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే అనేక గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

## జాతీయ రహదారి పక్కన పంట వ్యర్థాలు



**సారవకోట, జూన్ 18 (వార్త):** సారవకోట మండలం వడ్డినవలస సమీపంలోని జాతీయ రహదారి పక్కన పంట వ్యర్థాలు కుప్పకుప్పలుగా పేరుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కన పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప గ్రామాలకు చెందిన రైతులు పంట నూర్పిడి పనులు పూర్తి చేసిన అనంతరం మిగిలిన గడ్డి, పొట్టు, ఇతర వ్యవసాయ వ్యర్థాలను రహదారి పక్కనే వదిలివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల వ్యర్థాలు రహదారికి చేరువగా ఉండటంతో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాల్సి వస్తోందని చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ వ్యర్థాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారిపై పరిశుభ్రతతో పాటు భద్రతా ప్రమాణాలు కూడా పాటించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి పక్కన పేరుకుపోయిన పంట వ్యర్థాలను తొలగించాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రైతులు కూడా వ్యవసాయ వ్యర్థాలను రహదారులపై వదిలివేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. జాతీయ రహదారిపై సురక్షితమైన రాకపోకలు కొనసాగాలంటే వ్యర్థాల తొలగింపు, పర్యవేక్షణ చర్యలు అత్యవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ దాడులు

* ఇద్దరు వ్యక్తుల అరెస్టు * 16 మద్యం బాటిళ్ల స్వాధీనం
* నిందితులపై కేసులు నమోదు చేసిన అధికారులు



**నరసన్నపేట, జూన్ 18 (వార్త):** ఎక్సైజ్ శాఖ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మొత్తం 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట ప్పల నాయుడు తెలిపారు. బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో పోలాకి మండలం జిల్లేడువలస గ్రామానికి చెందిన అప్పన్న వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. అలాగే నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన నాగార్జున వద్ద నుంచి మరో 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు, నిల్వలు మరియు రవాణాపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని సీఐ వెంకటప్పల నాయుడు పేర్కొన్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ప్రజలు కూడా అక్రమ మద్యం విక్రయాల గురించి సమాచారం ఉంటే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

## డొంకూరులో బెల్ట్ షాప్‌లపై దాడులు

**ఇచ్ఛాపురం, జూన్ 18 (వార్త):** మండలంలోని సముద్ర తీరప్రాంతం డొంకూరులో ప్రొహిభిసన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. రెండు బెల్ట్ షాప్ లను నుండి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సి ఐ బి.మధు కుమార్ చెప్పారు.

## సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

* ఇంటర్, డిగ్రీ, ఐటీఐ విద్యార్థులకు అవకాశం * ఎస్సీ, ఎస్టీతో పాటు బీసీ, ఓసీ విద్యార్థులకూ అవకాశం




**నరసన్నపేట, జూన్ 18 (వార్త):** నరసన్నపేట సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని హాస్టల్‌లో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ తారకేశ్వరరావు తెలిపారు. గురువారం హాస్టల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రవేశాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు హాస్టల్‌లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యాలతో పాటు విద్యాభ్యాసానికి అనుకూల వాతావరణం కల్పించబడుతుందని చెప్పారు. ఈ హాస్టల్‌లో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నప్పటికీ, నిబంధనల మేరకు 10 శాతం సీట్లను బీసీ, ఓసీ విద్యార్థులకు కూడా కేటాయిస్తున్నట్లు వివరించారు. అర్హత కలిగిన విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను కొనసాగించాలని వార్డెన్ కోరారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం హాస్టల్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు అనుగుణంగా హాస్టల్ సౌకర్యాలను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కిన్నెరవాడలో ఎస్‌ఈడబ్ల్యూపీసీ కేంద్రం పరిశీలన



**సారవకోట, జూన్ 18(వార్త):** సారవకోట మండలం కిన్నెరవాడ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ఎస్‌ఈడబ్ల్యూపీసీ కేంద్రాన్ని మండల అభివృద్ధి అధికారి మోహన్ కుమార్ గురువారం పరిశీలించారు. కేంద్రంలో అమలవుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, నిర్వహణ విధానం, సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనుల పురోగతి, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత చర్యలపై అధికారులతో చర్చించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ, పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు పూర్తిస్థాయిలో విజయవంతం కావాలంటే ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆయన అన్నారు. గ్రామాభివృద్ధికి పరిశుభ్రతే మొదటి మెట్టు అని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమం - అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు

* ప్రజల విశ్వాసంతోనే అభివృద్ధి సాధ్యం
* ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
* 'రెండేళ్ల నమ్మకం' విజయోత్సవ సభ



**నరసన్నపేట, జూన్ 18 (వార్త):** కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నరసన్నపేట పట్టణంలోని శ్రీ సత్య కళ్యాణ మండపంలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి' విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి గత రెండేళ్లలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి సమస్యల పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్నారు. రైతులకు సాగునీటి సౌకర్యాలు మెరుగుపర్చేందుకు చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతు పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు సాధించి నరసన్నపేట నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసానికి గత రెండేళ్ల పరిపాలనే నిదర్శనమని అన్నారు. మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, స్వయం సహాయక సంఘాల బలోపేతం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీని నమ్ముకుని ప్రజా సేవలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ విజయోత్సవ సభలో కార్పొరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, కూటమి కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్‌పై బీఎల్‌ఏలకు అవగాహన



**మందస, జూన్ 18(వార్త):** మందస పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కింతల రామకృష్ణ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్వే(సర్)పై బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు బూత్ లెవెల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా, అలాగే అనర్హుల పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సర్వే నిర్వహణ విధానం, దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ, అవసరమైన పత్రాల సమర్పణ తదితర అంశాలపై బూత్ లెవెల్ ఏజెంట్లకు వివరంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, ఇతర ముఖ్య నాయకులు బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏపీటీపీసీ కార్పొరేషన్‌లో పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం

* ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు




**పలాస, జూన్ 18 వార్త):** ఏపీటీపీసీ కార్పొరేషన్లో పెట్టుబడులు ఆకర్షించడమే మా లక్ష్యమని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు స్పష్టం చేశారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అధ్యక్షతన 65వ బోర్డ్ సమావేశంలో అభివృద్ధి, పరిపాలన, పారిశ్రామిక ప్రగతిపై గురువారం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీటీపీసీ) 65వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ భూముల వినియోగం, పెండింగ్ ఆర్థిక అంశాల పరిష్కారం వంటి కీలక విషయాలపై చర్చలు నిర్వహించారు. కార్పొరేషన్ లోపెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, సంస్థ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసమావేశంలో 64వ బోర్డ్ సమావేశపు మినిట్స్‌ను ధృవీకరించడంతో పాటు, అప్పట్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై "యాక్షన్ టేకెన్ రిపోర్ట్"ను సమీక్షించారు. బోర్డు నిర్ణయాలు ఎంతవరకు అమలయ్యాయో పరిశీలించడం ద్వారా సంస్థ పరిపాలనా పారదర్శకతను మరింత బలోపేతం చేయాలని సభ్యులు అభిప్రాయపడ్డారు.చిత్తూరుకు చెందిన ఎం/ఎస్ తాజా అగ్రి ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థ ఎల్‌ఓఏ నిబంధనల ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించకపోవడం, వోఓఎం ఒప్పందాన్ని అమలు చేయకపోవడం వంటి అంశాలు సమావేశంలో ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచాయి. ప్రభుత్వ ఆస్తులు, ఒప్పంద నిబంధనల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని బోర్డు అభిప్రాయపడింది.డిప్యూటీ జనరల్ మేనేజర్ నియామకానికి ఆమోదంసంస్థలో ఖాళీగా ఉన్న మంజూరైన పోస్టును భర్తీ చేసేందుకు డిప్యూటేషన్ ప్రాతిపదికన ఒక డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను నియమించే ప్రతిపాదనను బోర్డు పరిశీలించి ఆమోదం తెలిపింది.ఆఫిక్ వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.10 కోట్లపై చర్చ చేపట్టి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఆఫిక్) వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.10 కోట్ల అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి పొందే అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ నిధుల రికవరీ కోసం ప్రభుత్వ స్థాయిలో అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ తదుపరి చర్యలు చేపట్టాలని బోర్డు నిర్ణయించింది. ఈ నిధులు తిరిగి లభిస్తే సంస్థ అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతమిస్తాయని అధికారులు పేర్కొన్నారు. చిత్తూరులో 13.71 ఎకరాల ప్రభుత్వ భూమి బదిలీరెవెన్యూ శాఖ జారీ చేసిన జీఓ ప్రకారం చిత్తూరు జిల్లా యడమర్రి మండలం మజారకోతపల్లె గ్రామంలో ఉన్న 13.71 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీటీపీసీకి బదిలీ చేసిన విషయాన్ని బోర్డు గమనించింది. ఈ భూమిని భవిష్యత్ పారిశ్రామిక, వాణిజ్య ప్రోత్సాహక కార్యక్రమాల కోసం వినియోగించే అవకాశాలు ఉన్నాయని, తద్వారా కార్పొరేషన్ కి మరింత ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీటీపీసీ సంస్థ పరిపాలనను బలోపేతం చేయడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ప్రభుత్వ ఆస్తుల సమర్థ వినియోగం, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్తులో మరింత ఉన్నతికి కార్పొరేషన్ తీసుకెళ్లడమే అందరి ధ్యేయంగా ఉండాలని అన్నారు.సమావేశానికి చైర్మన్ వజ్జ బాబూరావుతో పాటు వైస్ చైర్మన్ ఒ ఎండీ శేఖర్ బాబు, ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ ఆదినారాయణ, జేడి ఇండస్ట్రీస్ జి కృష్ణారావు, డిప్యూటీ సెక్రటరీ ఇండస్ట్రీస్ హనుమంతరావు, ఏపీటీపీసీ జీఎం హనుమ నాయక్, కంపెనీ సెక్రటరీ కరుణాకర్, అకౌంట్స్ మేనేజర్ శ్రీరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాలు పంపిణీ



**ఇచ్ఛాపురం, జూన్18 (వార్త):** కీర్తిపురం, పాయితారి, కొలిగం గ్రామసచివాలయాల్లో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లోపింటి పద్మనాభం, పిఏసిఎస్ డైరెక్టర్ గిన్ని బాలరాజు లెంక మురళికృష్ణా, వలపల నరహరి అగ్రికల్చర్ అసిస్టెంట్ జీవనజ్యోతి పాల్గొన్నారు. అలాగే రత్తకన్నా గ్రామంలో వరి విత్తనాలు పంపిణీ చేశారు. నీటి సంఘ అధ్యక్షులు బుగత జగన్, లెంక ప్రకాష్ గ్రామ రైతులు జయ రాము, రేఖా రావు, దుర్గాసి దుర్గరావు, దుర్గాసి జోగారావు,ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో ఎన్యుమరేటు ఫారాలు అందజేత



**ఇచ్ఛాపురం, జూన్ 18 (వార్త):** మున్సిపాలిటీ పరిధి రత్తకన్న 20 వ వార్డు లో ఎన్యుమ రేటు ఫారాలు పంపిణీ చేశారు.ఎస్ ఐ అర్ ప్రక్రియ లో భాగంగా సచివాలయం అడ్మిన్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఓటర్లు కు ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంజూ రౌలో, సీనియర్ తెలుగుదేశం నాయకులు సుభాష్ రౌలో తదితరులు పాల్గొన్నారు.

## బోధనలో ఉపాధ్యాయులు మెలకువలు పాటించాలి



**నరసన్నపేట, జూన్ 18(వార్త):** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు మరింత మెలుకువతో వ్యవహరించాలని మండల విద్యాశాఖ అధికారి దాలినాయుడు సూచించారు. గురువారం నరసన్నపేట మండలం సత్యవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎంఈఓ వారి అభ్యాస సామర్థ్యాలు, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే పటిష్టమైన విద్యా నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులలో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు విద్యాశాఖ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో అభ్యాస ఫలితాలను మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణా తరగతులు కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడం ద్వారా విద్యా ప్రమాణాలు పెరుగుతాయని ఎంఈఓ అన్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు.

## అధ్వాన్నంగా కొత్తపేట రహదారి

* రోడ్డుపైనే వరద నీరు
* ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణీకులు



**మందస, జూన్ 18(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద పంచాయతీ కొత్తపేట సమీప ప్రధాన రహదారిపై నిత్యం నీరు ప్రవహిస్తూ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం మాత్రమే కాకుండా ఎండాకాలంలో కూడా రోడ్డుపై నీరు పారుతుండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా ప్రతీ రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రోడ్డుపై నిరంతరం నీరు నిల్వ ఉండటం, కొన్నిచోట్ల ప్రవహించడం వల్ల గుంతలు ఏర్పడి రహదారి దెబ్బతింటోంది. ద్విచక్ర వాహనదారులు తరచూ జారి పడుతున్నారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ లేదా లీకేజీ నీరు రోడ్డుపైకి చేరుతుండటమే సమస్యకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి రాత్రి వేళల్లో రోడ్డుపై నీరు ఉండటంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. పాదచారులు, విద్యార్థులు, రైతులు నిత్యం ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. రద్దీగా ఉండే ఈ రహదారిపై నిత్యం కొనసాగుతున్న రోడ్డుపై వరదకు చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే సమస్యను పరిశీలించి, నీరు రోడ్డుపైకి వచ్చే కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నేడు పోలేరు ఫీడర్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కంచిలి, జూన్18 (వార్త):** కంచిలి మండలం పోలేరు విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి యజ్ఞేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కేసరిపడా,బైరిపురం, పోలేరు, కుమ్మరి నౌగాం, రేఖ దేవిపురం, డిజిపురం, బెల్లుపడ, ఎక్కల, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


## స్మశాన వాటికకు 10 సెంట్లు కేటాయించండి

* పలాస ఆర్డీవోకు జిల్లా కలెక్టర్ ఆదేశం



**కంచిలి జూన్ 18 (వార్త):** కంచిలి పంచాయతీ దాకరాపల్లి గ్రామస్తుల కోసం అవసరమైన స్మశాన వాటిక ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన 10 సెంట్లు స్థలాన్ని కేటాయించి వెంటనే సబ్ డివిజన్ చేయాలని జిల్లా కలెక్టర్ పలాస ఆర్డిఓ అప్పలరాజును ఆదేశించారు. కంచిలి అధికారులు కేవలం రెండు సెంట్లు మాత్రమే ఇవ్వడానికి ఏర్పాట్లు చేయడంతో స్మశాన వాటిక విషయంలో తొలి నుంచి పోరాటం చేస్తున్న గ్రామానికి చెందిన పండిత ప్రసాద్ ఈ స్థలం చాలదని జిల్లా కలెక్టర్కు సమాచారం ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ గురువారం ఆర్డీవో కార్యాలయానికి ప్రసాదును రప్పించి నేరుగా వీడియో కాల్ ద్వారా సమావేశమై చర్చించారు. 2025 ఏప్రిల్ నెల నుంచి నలుగుతున్న ఈ వ్యవహారం ఇప్పటికి కొలిక్కి రాకపోవడం పట్ల జిల్లా కలెక్టర్ పలాస ఆర్డిఓ అప్పలరాజు పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఈ విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని కలెక్టర్ ఆగ్రహించారు. ఆ గ్రామం వద్ద సుమారు ఎకరా భూమి ప్రభుత్వానికి చెందినది ఉండగా అందులో 10 సెంట్లు స్మశాన వాటికకు ఇవ్వడానికి అధికారులకు వచ్చిన అభ్యంతరం ఏమిటని కలెక్టర్ నిలదీసినట్లు తెలిసింది. రెండు రోజుల్లోగా ఈ వ్యవహారం పూర్తిచేసి తగు నివేదిక వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు. అనంతరం ఆర్డిఓ అప్పలరాజు కంచిలి తహసిల్దార్ రమేష్ కుమార్ పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇంత చిన్న పనికి ఏడాది కాలం చేయడం సరికాదని డిటి సహకారంతో రెండు రోజుల్లో 10 సెంట్లు స్థలం కేటాయించి దాన్ని సబ్ డివిజన్ చేసి వ్యవహారం పూర్తిచేసి వెంటనే గ్రామస్తులకు అప్పగించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశానికి పండిత ప్రసాద్ కూడా హాజరై జిల్లా కలెక్టర్కు మళ్ళీ తన గోడు వినిపించారు. ఆగమేఘాలపై ప్రస్తుతం కేటాయించే స్థలంలో మట్టి వేయించే కార్యక్రమం జరుగుతుంది. శుక్రవారం స్మశాన వాటిక స్థలాన్ని ఆర్డీవో అప్పలరాజు పరిశీలించనున్నారు.

## ఇసుక తవ్వకాలను అడ్డుకోండి




**శ్రీకాకుళం, జూన్ 18 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో జోరుగా ఇసుక, గ్రావెల్, గ్రానైట్ అక్రమ రవాణాను అరికట్టి ప్రకృతి వనరులను పరిరక్షించాలని యునైటెడ్ జనతాదల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతి నాయుడు అన్నారు. గురువారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో జోరుగా ఇసుక, గ్రావెల్, గ్రానైట్ అక్రమ రవాణా ను ముఖ్యంగా మంత్రి అచ్చెన్నాయుడు అనుచరులు, నలుగురు ఎం ఎల్ ఎ ల డైరెక్షన్‌లో జరుగుతోందన్నారు. ఆమదాలవలస, ఎచ్చెర్ల, రణస్థలం, పాతపట్నం ఎమ్మెల్యేల పాత్ర ఉందన్నారు. వీరితోపాటు శ్రీకాకుళం డిఎస్పి, రణస్థలం సిఐ, ఎంఆర్ఒ, శ్రీకాకుళం ఆర్‌డీవోల పాత్ర ఉందని, తక్షణం జిల్లా కలెక్టర్, ఎస్ పి లు సమగ్ర దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జె డి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతి నాయుడు, జిల్లా కార్యదర్శి అందవరపు మనోహర్, జిల్లా మహిళా కన్వీనర్ మామిడి తేజోవతి, బురగాపు లక్ష్మి పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనకు కూటమి పెద్దపీట

* ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

**సోంపేట, జూన్ 18 (వార్త):** కూటమి ప్రభుత్వంలో యువతకు ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కొంచాడ రాజేశ్వరరావు డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ అశోక్ జ్యోతి ప్రజ్వలన చేస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు . నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రంలో గల వివిధ కంపెనీలను సమన్వయం చేస్తూ ఆయా కంపెనీలలో నైపుణ్యతను బట్టి అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఇటువంటి ప్రక్రియలో ఎటువంటి అవకాశం లభించిన దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ గతంలో ఉద్యోగాల కోసం అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరిగేవారని ప్రస్తుతం కంపెనీలే ప్రభుత్వాల కృషితో అభ్యర్థుల వద్దకు వస్తున్నాయని అన్నారు. కె ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కొంచాడ శేషాద్రి మాట్లాడుతూ యువత తప్పనిసరిగా తమ నైపుణ్యతను అభివృద్ధి పరచుకోవడం ద్వారా ఇటువంటి కార్యక్రమాలలో విజయాలు సాధించి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో 259 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 107 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే. తేజేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ . జె.జయ శంకర్, టిడిపి నాయకులు మద్దు కుమార్, సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, బీన ఆనందరావు,చిత్రాడ శ్రీనివాస్,చిత్రాడ శేఖర్, పొందూరు రాజు, మద్దు రాజారావు, బీన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## సర్ ప్రక్రియ వేగవంతం



**సోంపేట జూన్ 18 (వార్త):** సోంపేట పట్టణంలో అలాగే గ్రామాల్లోనూ సర్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నది. ప్రభుత్వం వైపు నుంచి బిఎల్వోలు తగు సమాచారంతో ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ఆ సందర్భంలో ప్రధాన పార్టీలకు చెందిన బిఎల్ఏలు వారితో కొనసాగుతూ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. చాలామంది ఓటర్లకు ఈ కార్యక్రమం పై అవగాహన సరిగా లేకపోవడంతో సమాచారం ఇవ్వడంలో కొద్దిపాటి ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా సందర్భాల్లో డీఎల్ఏలు ఆయా సమాచారాన్ని బిఎల్వోలుకు అందించి కార్యక్రమం పూర్తయ్యేలా చూస్తున్నారు.



# గొల్లవూరులో విషాదం

*** మహిళ అనుమానాస్పద మృతి * అనాథలైన ఇద్దరు చిన్నారులు**

**సోంపేట జూన్ 18(వార్త):** సోంపేట మండలం గొల్లవూరు పంచాయతీలో విషాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి పిన్నింటి ఊర్వశి (38) అనుమానాస్పద స్థితిలో మరణించింది. ఆ కుటుంబంలో దుఃఖం అలుముకుంది. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు బారువ ఎస్సై హరిబాబు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల అసలు కారణాలు, పోస్టుమార్టం, విచారణ అనంతరమే తెలియనున్నాయని ఎస్సై పేర్కొన్నారు. ఈ మరణం ఆ కుటుంబానికి ఇది మొదటిది కాదు. గత మార్చి 13న ఊర్వశి భర్త పిన్నింటి రాజారావు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబం అప్పటికే కుప్పకూలింది. ఇప్పుడు తల్లి కూడా అనుమానాస్పద స్థితిలో మరణించడంతో ఇద్దరు చిన్నారులు అనాథల్లా మిగిలిపోయారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ పసిహృదయాల రోదన చూసిన ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చుతున్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. అసలు నిజం ఏంటనేది త్వరలోనే తేలాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఇద్దరు చిన్నారుల భవిష్యత్తు, వారి సంరక్షణ ఇప్పుడు అందరినీ కలిచివేస్తున్న ప్రధాన ప్రశ్న. ఈ క్లిష్ట సమయంలో స్థానికులు, అధికారులు ఆ పిల్లలకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.



## బోరు బావి వద్దే చెత్తకుప్పలు

**నరసన్నపేట, జూన్ 18 (వార్త):** పారిశుద్ధ్యంపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు ప్రజల నిర్లక్ష్య వైఖరి కారణంగా పరిశుభ్రత లక్ష్యాలు నెరవేరడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు నరసన్నపేటలో పర్యటించి పారిశుద్ధ్యం, పరిశుభ్రత ప్రాముఖ్యతపై స్థానికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీనికి నిదర్శనంగా నరసన్నపేట పట్టణంలోని బైరాగి వీధిలో ఉన్న బోరు బావి పరిసరాల పరిస్థితిని స్థానికులు ప్రస్తావిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే తాగునీటి వనరుగా ఉన్న బోరు బావి వద్దే చెత్తాచెదారం, వ్యర్థాలను పడేయడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారిందని అంటున్నారు. దీంతో బోరు బావి వినియోగానికి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి వనరుల వద్ద వ్యర్థాలను పారవేయడం వల్ల పరిశుభ్రతకు భంగం కలగడమే కాకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. స్థానిక సంస్థలు, అధికారులు చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం కూడా అవసరమని, సామాజిక బాధ్యతతో వ్యవహరించి చెత్తను నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని పలువురు కోరు తున్నారు. బైరాగి వీధిలోని బోరు బావి పరిసరాలను వెంటనే శుభ్రపరచి తాగునీటి వనరును పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## పద్మనాభపురంలో విత్తనాల పంపిణీ



**పలాస, జూన్ 18 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం గ్రామంలో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించాలనే లక్ష్యంతో పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష చొరవ మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సదుపాయాలు అందేలా ఎమ్మెల్యే గౌతు శిరీష నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే గౌతు శిరీషకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ క్లస్టర్ కన్వీనర్ సవర రాంబాబు, కొండె నర్సింహులు, బద్రి గోపాలరావు, కిక్కిర బాలకృష్ణ, కొండె తిరుపతి, గణేష్, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా సర్ సర్వే



**జి.సిగడాం, జూన్18 (వార్త):** ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) సన్నాహక కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నాయి. గురువారం గొబ్బూరు, ఆనందపురం, వాంద్రంగి, పెంట, జి.సిగడాం, దేవరవలస జాడ, జగన్నాధవలస పాలఖండ్యాం, గెడ్డ కంచరాం మండల పరిధిలో తదితర గ్రామాల్లో బిఎల్ఒలు ప్రతి ఇంటింటికి సర్వేకు వెళుతూ ప్రతి ఒక్క ఓటర్ నకు ఎన్యుమరేషన్ పత్రాలు అందజేస్తూన్నారు.వివరాలు నింపి వెనక్కి ఇస్తేనే ముసాయిదా జాబితాలో పేరు ఉంటుందని తెలిపారు. జులై 14 వరకూ నెల రోజుల పాటు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ ఒ) ఇంటింటికీ వస్తామని. ప్రతి ఓటరుకూ రెండు ఎన్యుమరేషన్ ఫాంలు ఇస్తున్నామని. వాటిలో ఓటరు పేరు, ఫొటో గుర్తింపుకార్డు సంబరు, చిరు నామా వివరాలతో పాటు ఓటరు పాత ఫొటో ముద్రించి ఉంటాయి. మిగతా వివరాలను ఓటరు నింపాలి. అందుకు బీఎల్ వోలు సహకరిస్తారు. పూర్తిచేసిన ఫాంలను బీఎల్ వో వచ్చి తీసుకుంటారు. ఈ నెల రోజుల్లో ఎన్యుమరేషన్ ఫాంలు ఇవ్వడానికి, నింపినవాటిని తిరిగి తీసుకోవడానికి మూడుసార్లు బీఎల్ వోలు ప్రతి ఇంటికీ వస్తారని చెప్పారు.సర్వే పూర్తయ్యాక....ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి ఆగస్టు 20 వరకూ క్లెయిమ్లు, అభ్యం తరాలపై దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా ఓటరుగా చేరాలంటే ఫాం-6లో, చిరునామా మార్పునకు ఫాం-8లో, మృతులు, అనర్హుల పేర్లు తొలగింపునకు ఫాం-7లో దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబరు 18 వరకూ వాటిని పరిశీలించి, అర్హతలు ఉంటే తుది జాబితాలో పేరు చేరుస్తారు. అనర్హులుగా తేలితే తొలగిస్తారు. సెప్టెంబరు 22న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారు.

## సర్వేపై సవరణలు ఉంటే దరఖాస్తు చేసుకోండి

**పలాస, జూన్ 18 (వార్త):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాల నుండి అర్హత కలిగిన ఏ కుటుంబం లేదా వ్యక్తిని గాని మినహాయించకుండా ప్రతిష్టాత్మకంగా ఏకీకృత కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే)ను గురువారం శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఆదేశముల ప్రకారం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలో గల 16 సచివాలయాలలోని సుమారు 18000 కుటుంబాల నుండి ఏకీకృత కుటుంబసర్వేను చేపట్టారు. గౌరవ స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు డైరెక్టర్ సదరు ఏకీకృత కుటుంబసర్వే జాబితా నందు నమోదు అయిన వివరములను ధృవీకరణ చేసుకొనుటకు గాను సంబంధిత డేటాను సచివాలయాల వారిగా పంపియున్నారు. సదరు జాబితాను అన్నీ సచివాలయాలందు పబ్లిష్ చేశారు. సదరు జాబితాను పరిశీలన చేసుకొని ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే సంబంధిత అధికారులకు గ్రీవెన్స్ ద్వారా తెలియ పరచి సరిచేసుకొనుకోవాలన్నారు.

# ఖాళీ బిందెలతో
# మహిళల నిరసన

*** తాగునీరు ఇప్పించాలని కోరుతూ అలికాం-బత్తిలి రహదారిపై బైఠాయింపు * ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు * చుట్టూ నీరు ఉన్నా....చుక్క నీరు ఇవ్వలేరా అంటూ నినాదాలు * రెండు గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం * ధర్నాకు మద్దతిచ్చిన వైసీపీ నాయకులు * పట్టించుకోని పంచాయతీ అధికారులు * సర్ది చెప్పిన పోలీస్ అధికారులు * ససేమిరా అన్న మహిళలు, వైసీపీ నాయకులు * వైసీపీ నేతలను పీఎస్‌కు తరలింపు * ఈ సమస్యపై అధికారులతో మాట్లాడుతామన్న సీఐ * ఎట్టకేలకు ధర్నా విరమించిన మహిళలు**



**హిరమండలం, జూన్ 18 (వార్త):** చుట్టూ నీరు ఉంది.. మాకు మాత్రం తాగేందుకు నీరు లేదు.. గత నాలుగు నెలలుగా రక్షిత నీటి పథకం నుంచి నీరు రావడం లేదు.. పంచాయతీ పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.. ఎవరూ పట్టించుకోవడం లేదు.. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డెక్కి తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నాం.. అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. హిరమండలం మండల కేంద్రంలో గురువారం మహిళలు ధర్నాకు దిగారు. ఖాళీ బిందెలతో మోణింగి, కోరాడ వీధులకు చెందిన మహిళలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వంశధార జలాశయం, వంశధార నది ఉన్నా మాకు తాగేందుకు నీరు లేదంటూ మహిళలు ధ్వజమెత్తారు. మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జ్ ఈవో పట్టించుకోవడం లేదని, రెగ్యులర్ ఈవోను నియమించాలన్నారు. మహిళలు చేపడుతున్న ధర్నాకు మద్దతుగా మండల వైసీపి అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనలు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమం పథకాలు అందజేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న నాయకులు కనీసం ప్రజలకు గుక్కెడు నీరు అందజేయడంలో విఫలమయ్యారన్నారు. సుమారు రెండు గంటలసేపు నిరసనలు చేపట్టడంతో శ్రీకాకుళం, కొత్తూరు వైపు వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కొత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాదరావు అక్కడకు చేరుకున్నారు. మహిళలతో మాట్లాడుతూ రహదారిపై నిరసనలు చేపట్టకూడదని, సమస్యలు ఉంటే సంబంధిత అధికారికి వినతిపత్రాన్ని అందజేయాలని, దీని వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. వైసీపి మండల అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవటం వల్లనే తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దీనిని పరిష్కరించేంత వరకు నిరసనలు విరమించబోమన్నారు. దీంతో పోలీసులు రామకృష్ణతో పాటు మరో నలుగుర్ని అదుపులోకి తీసుకుని హిరమండలం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళతామని సీఐ హామీ ఇవ్వడంతో మహిళలు ఈ ధర్నాను విరమించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందువల్ల పోలీసుల అనుమతుల్లేకుండా ఎటువంటి ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టకూడదన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుందని సీఐ హెచ్చరించారు

### ‘రెండేళ్ల నమ్మకం’పై.. నేడు..
# సిక్కోలు ప్రగతి సంబరాలు

*** ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో భారీ బహిరంగ సభ * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * అభివృద్ధి, సంక్షేమ గణాంకాలను వివరించిన కలెక్టర్**



**శ్రీకాకుళం, జూన్ 18 (వార్త):** జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం, ప్రగతి సంబరాలకు సర్వం సిద్ధమైంది. స్థానిక ఏడు రోడ్ల కూడలి సమీపంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఉదయం 10:30 గంటలకు ఈ భారీ బహిరంగ సభ ప్రారంభం కానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో సాధించిన ప్రగతి, వివిధ రంగాలలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సభకు జిల్లా నలుమూలల నుండి సుమారు 5,000 మంది లబ్ధిదారులతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నేతృత్వంలో గడిచిన రెండేళ్ల కాలంలో జిల్లాలో పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి ప్రాజెక్టులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. జిల్లా పారిశ్రామిక రూపురేఖలను మార్చే మూలపేట అంతర్జాతీయ పోర్టు మౌలిక వసతుల పనులు ఇప్పటికే 75 శాతం పూర్తయ్యాయి. దశాబ్దాల కల అయిన నేరడి బ్యారేజ్ అంతరాష్ట్ర జల వివాద పరిష్కారం చివరి దశకు చేరగా, నాగావళి-వంశధార నదుల అనుసంధాన పనులకు నిధులు విడుదల చేసి వేగవంతం చేశారు. వీటితో పాటు పలాస పరిధిలో విమానాశ్రయ ఏర్పాటుకు భూసేకరణ పనులు, కొత్తగా ఏర్పాటైన వైజాగ్ రైల్వే జోన్ పరిధిలో ఇచ్చాపురం కేంద్రాన్ని వాల్తేరు డివిజన్ పరిధిలోనే కొనసాగించేలా ముందడుగు వేశారు. పలాస జీడిపప్పుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించగా, ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉన్న పొందూరు ఖాదీ విశిష్టతకు జీఐ ట్యాగ్ గుర్తింపు తెచ్చేలా చర్యలు చేపట్టారు. మరోవైపు జిల్లాలో అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా చేరవేస్తూ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. స్త్రీ శక్తి పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 231.12 లక్షల మంది మహిళలకు 86.79 కోట్ల ఖర్చుతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిషాన్ ద్వారా 2,79,100 రైతు కుటుంబాల ఖాతాలలో 526.63 కోట్లు, ‘తల్లికి వందనం’ పథకం కింద 2025-26 సం.లో 2,54,408 మంది తల్లుల ఖాతాలలో ?381.61 కోట్లు నేరుగా జమ చేశారు. మహిళల ఆర్థిక భరోసా, ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రవేశపెట్టిన ‘దీపం-2.0’ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 3,99,220 మంది లబ్ధిదారుల ఖాతాల్లో 31.22 కోట్లు నేరుగా బదిలీ చేయడం జరిగింది. సమాజంలోని ప్రతి ఒక్కరికీ మేలు చేకూర్చేలా ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద ఆటో, మ్యాక్సీ డ్రైవర్లకు 20.83 కోట్లు, మత్స్యకార భృతి కింద 15,548 కుటుంబాలకు ?31.09 కోట్లు కేటాయించి ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే 1,55,756 మంది విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద 45.47 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాలో 13,527 మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, 34 జాబ్ మేళాల ద్వారా 6,257 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సభకు వచ్చే ప్రజలకు, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జర్మన్ షెడ్లు, తాగునీరు, మజ్జిగ, కుర్చీలు, విస్తృత వైద్య శిబిరాలను సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు.

## సర్‌లో భాగస్వామ్యం కావాలి

**మెళియాపుట్టి, జూన్ 18 (వార్త):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అనపాన రాజశేఖర్ రెడ్డి మెలియాపుట్టి మండల కేంద్రంలో 100, 101 బూత్‌లలో సర్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఓటర్ వెరిఫికేషన్ ఓటర్ల వివరాల ధృవీకరణ చేపట్టే కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలోని వివరాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అవగాహన కల్పించి, అలాగే కొత్త ఓటర్ల నమోదు, చిరునామాలో మార్పుల వివరాలు, సవరణలు వంటి అంశాలపై ప్రజలకు తెలియపరిచారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలని కోరుతూ, ఓటరు జాబితా ఖచ్చితత్వం కోసం కృషి చేయడంతో పాటు అర్హులైన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు టిడిపి పార్టీ మండల యూత్ అధ్యక్షులు బస్వ పరమేశ్ రెడ్డి, వి ఎల్ వోస్ గా కార్యదర్శి కిషోర్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ మోహనకృష్ణ, దుక్క శంకర్ రెడ్డి, రామకృష్ణ, జ్ఞానేశ్వరరావు తదితరులున్నారు.


## దివ్యాంగ చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ



**మెళియాపుట్టి, జూన్ 18 (వార్త):** మెళియాపుట్టి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ చిన్నారులకు మండల తెలుగు యువత అధ్యక్షుడు బస్వ పరమేశ్వర్ రెడ్డి విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీవీఎస్ఎస్ఆర్ మహాలక్ష్మి సమక్షంలో సుమారు 20 మంది దివ్యాంగ విద్యార్థులకు అభ్యాసానికి అవసరమైన పలకలు, పుల్లలు తోపాటు స్నాక్స్ ను గురువారం పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి తో పాటు ప్రధాన ఉపాధ్యాయురాలు మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులున్నారు.

# ప్రాణాలతో.. విద్యుత్ శాఖ చెలగాటం

*** 33 కేవీ విద్యుత్ లైన్ల కిందే ఇంటి నిర్మాణం**
*** ఎవరైతే మాకేమిటి డోంట్ కేర్**
*** నిబంధనలకు తూట్లు పొడిచి 20 వేలకు విద్యుత్ కనెక్షన్ మంజూరు**
*** చేతిలో పైసలు పెట్టు... మీటర్ పట్టు..**
*** పలాసలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం**
*** లైన్‌మాన్ తీరుపై విమర్శలు**






పలాస, జూన్ 18 (వార్త): పలాసలో విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వారి తీరుపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు తూట్లు పొడుస్తూ విద్యుత్ కనెక్షన్లు ఇస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పలాసలోని నేతాజీ నగర్, సూది కొండ ప్రాంతాల్లో నిర్మాణల్లో ఉన్న గృహాలకి , అదే ఇంటి పైనుంచి 33 కె.వి విద్యుత్ లైన్లు వెళ్తున్నప్పటికీ కనెక్షన్ మంజూరు చేయడం సంచలనం రేపుతోంది. పలాస విద్యుత్ శాఖ వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నిబంధనల ప్రకారం 33 కెవి హెచ్ఎటిలైన్ల కింద గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం పూర్తిగా నిషేధం అయినా, లైన్ మాన్ వాటిని పూర్తిగా పక్కనబెట్టి మీటర్ ఇవ్వడం తీవ్ర ఆరోపణలకు దారితీసిందని స్థానికులు మండిపడుతున్నారు. ఎవరైతే నాకేమిటి డోంట్ కేర్ అని, నిబంధనలకు తూట్లు పొడిచి 20 వేలకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసారని, చేతిలో పైసలు పెట్టు... మీటర్ పట్టమని చెబుతుండడంతో పలువురు ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు. ఈ కనెక్షన్ కోసం దాదాపు రూ.20వేల వరకు అక్రమంగా వసూలు చేశారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయని, కొంతమంది గుసగుసలాడుకుంటున్నారు. అధిక వోల్టేజ్తో విద్యుత్ ప్రవహించే హెచ్‌టి లైన్ల కింద ఇలాంటి కనెక్షన్లు ఇవ్వడం వల్ల ఎప్పుడైనా అగ్ని ప్రమాదం లేదా ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. గతంలో అదే ప్రాంతాల్లో కొన్ని సంఘటనలు జరిగినప్పటికీ అవేమి పట్టించుకోకుండా విద్యుత్ మీటర్ వేయడంతో స్థానికులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ మీటర్ వేయడంలో లైన్ మాన్‌కు భారీగా ముడుపులు చేతులు మారినట్ల తెలుస్తుంది. ఈ ఘటనపై విద్యుత్ శాఖ డీఈ యజ్ఞేశ్వరరావు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546